క్లుప్తంగా

గోరంట్ల మాధవుడి సేవలో హంపి పీఠాధిపతి



గోరంట్ల మాధవస్వామికి పూజలు చేస్తున్న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

కోడుమూరు రూరల్ : మండలంలోని గోరంట్ల మాధవస్వామిని ఆదివారం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి దర్శించుకున్నారు. ముందుగా పీఠాధిపతికి గ్రామస్తులు, ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. పూజలనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను పీఠాధిపతికి అందజేశారు. పీఠాధిపతి వెంట సీనియర్ రాజకీయ నాయకుడు కోట్ల హరిచక్రపాణిరెడ్డి ఉన్నారు.

క్యాలెండర్ విడుదల చేసిన ఎమ్మెల్యే



భోగేశ్వరాలయం క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న గౌరు చరితారెడ్డి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆదివారం విడుదల చేశారు. పాణ్యం ఎమ్మెల్యే ఇంటివద్ద ఆలయ చైర్మన్ ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. దేవస్థానం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, ఆలయ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కమిటీ ఎంపిక



అధ్యక్షుడు సంజీవరాజును అభినందిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: ఆటో యూనియన్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆటో యూనియన్ నాయకులతో జరిగిన సమావేశంలో ఈఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా సుధాకర్, కార్యదర్శిగా బాలరంగయ్య, అధ్యక్షునిగా రెడ్డిపోగు సంజీవకుమార్, సహాయ కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షునిగా ఇస్మాయిల్, డిప్యూటీ కార్యదర్శిగా దస్తగిరి, ట్రెజరర్‌గా వలిబాషా, వర్కింగ్ ప్రసిడెంట్‌గా సురేంద్ర ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఈశ్వర్ ప్రకటించారు.


ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో నాయకులు

ఓర్వకల్లు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక బుగ్గరామేశ్వర డిగ్రీ కళాశాలలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆశపోగు పరమేష్ మాదిగ, మండల సీనియర్ నాయకులు గుండమయ్య మాదిగ, శ్రీను మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎంపిక చేశారు. మండల అధ్యక్షునిగా బోగ్గుల మహేంద్రబాబు మాదిగ, మండల ఉపాధ్యక్షుడిగా బండమీది నారాయణమాదిగ, మండల అధికారప్రతినిధిగా సన్యాసి సురేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బొల్లెపోగు లక్ష్మణ్‌మాదిగ, కార్యదర్శిగా రామకృష్ణ మాదిగా, చేట్ల నారాయణ మాదిగ, వై.మహేష్‌మాదిగా, కమిటీ సభ్యులుగా పక్కిరప్ప మాదిగ, ఎం.లక్ష్మన్న మాదిగ, సురేష్ మాదిగ, పి.రాజు మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాదిగల సమస్యల పరిష్కారానికి సభ్యులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్ఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు, ఎంఎస్ఎం అధికార ప్రతినిధి కాశపోగు సూరి సూచించారు.

మహా నటుడు రాజ్‌కపూర్



రాజ్‌కపూర్ గీతాలు ఆలపిస్తున్న గాయకుడు

కర్నూలు కల్చరల్: రాజ్‌కపూర్ మహా నటుడని వక్తలు అన్నారు. తొలితరం హిందీ నటుల్లో ఆయన మేటి ఎవరూ రాబోరని కొనియాడారు. రాజ్‌కపూర్ నటించిన ఆవారా, మేరా నామ్ జోకర్ వంటి సినిమాలు ప్రజాదరణ పొందాయన్నారు. రాజ్‌కపూర్ 101వ జయంతిని కర్నూలులో టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. పలువురు గాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకులు నజీర్, సిరాజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువులు... సాగేదెలా ?

- నాడు–నేడు పనులకు కూటమి సర్కార్ మంగళం
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- షెడ్లలోనే తరగతుల నిర్వహణ... పట్టించుకోని పాలకులు
- విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు తప్పని ఇబ్బందులు

కర్నూలు (రూరల్) : టీడీపీ కూటమి సర్కార్ పాలనలో విద్యారంగం అస్తవ్యస్తంగా మారింది. విద్యార్థుల విద్యాభ్యాసం ముందుకు సాగడం లేదు. విద్యాభివృద్ధి కుంటుపడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ప్రతి పథకాలను కూటమి సర్కార్ పక్కన పెట్టడంతో సమస్యలు మళ్లీ మొదటికి వచ్చాయి. వాస్తవానికి గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన నాడు–నేడు పథకానికి కూటమి సర్కార్ మంగళం పాడడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలు మండలానికి సంబంధించి ఫేజ్1 కింద 24 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ మేరకు నూతన భవనాలు, మౌలిక వసతుల కల్పనకు దాదాపుగా రూ.592.85 కోట్లు ఖర్చు చేసింది గత సర్కార్. అదేవిధంగా ఫేజ్ 2లో భాగంగా 58 స్కూళ్లను ఎంపిక చేసి రూ.2,866.41 కోట్ల నిధులతో అంచనా వేసి పనులు ప్రారంభించారు. రూ.1532.3 కోట్ల పనులు పూర్తి అయ్యాయి కూడా. ఇంకా రూ.1334.1 కోట్లు మంజురు కావాల్సి నేపథ్యంలో ఎన్నికలు వచ్చాయి.ఈ నేపథ్యంలోఅధికారం చేపట్టిన టీడీపీ కూటమి సర్కార్ నాడు–నేడు పథకాన్ని పక్కనపెట్టడంతో పాఠశాలల అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారిపోయాయి. స్కూళ్ల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని ఆయా గ్రామాల ప్రజలు కూటమి సర్కార్ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

షెడ్డులో మగ్గుతున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదు. ప్రత్యేకించి కర్నూలు మండల పరిధిలోని ఆర్ కొంతలపాడు, పి. రుద్రవరం, సుంకేసుల, స్టాంటన్‌పురం గ్రామాల్లో స్కూళ్ల అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. సుంకేసుల, స్టాంటన్‌పురం గ్రామాల్లో విద్యార్థులు అసంపూర్తిగా నిర్మించిన గదులలోనే తీవ్ర ఇబ్బందులు పడుతూ విద్యనభ్యశిస్తున్నారు. ఆర్ కొంతలపాడు, పి. రుద్రవరం విద్యార్థుల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. పి.రుద్రవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సంబంధించి నాడు–నేడు ఫేజ్ 2 క్రింద గత సంవత్సరం రూ 54.96 లక్షలు మంజురు కావడంతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. దాదాపు రూ. 16 లక్షల అంచనాతో 2 రెండు గదులు నిర్మాణాలు ప్రారంభించారు. లెంటల్ లెవల్ పనులు జరుగుతుండగానే ప్రభుత్వం మారడంతో అభివృద్ధి పనులు నిలిచిపొయాయి. ప్రస్తుతం గ్రామంలోని పశుసంవర్ధక శాఖ భవనంలో విద్యార్థులు చదువుకుంటున్నారు. చిన్న గదిలో 1–5 వ తరగతి వరకు 45 మంది విద్యార్థులు మగ్గుతున్నారు. సర్పంచ్ ఎంకే మధసూదన్ విద్యార్థుల ఇబ్బందులు గమనించి ,గ్రామస్తుల సహకరంతో రూ.40 వేలు వెచ్చించి షెడ్డు నిర్మించారు. ఈ షెడ్డులో పిల్లలు చదువుకుంటున్నారు. వంటశాల లేకపోవడంతో మధ్యాహ్న భోజనం ఆరుబయటే చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యలు గుర్తించిన కొందరు తల్లి,దండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించారు.



రుద్రవరం: షెడ్డులో చదువుకుంటున్న విద్యార్థులు

షెడ్డులో విద్యాభ్యాసం

ఆర్. కొంతలపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. ఈ స్కూల్‌లో 9 మంది ఉపాధ్యాయులు ఉండగా 112 మంది విద్యార్థులు (6–10) చదువుకుంటున్నారు. రూ. కోటి డెబ్బై లక్షలు మంజురుకాగా టీడీపీ నాయకుడు అడ్డుపడి స్కూల్ కమిటీ చైర్మన్ ద్వారా నిర్మాణ పనులకు ఆమోదం తెలుపలేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. గ్రామానికి చెందిన ఓ దాత ఔదార్యంతో తన సొంత షెడ్డును విద్యార్థుల కోసం కేటాయించాడు. ఈ షేడ్ 7, 8, 9వ తరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు. షెడ్డు కూడా సరిపోకవడంతో సమీపంలోని మండల ప్రాథమిక పాఠశాల లో 6తరగతి, 10 తరగతిని నిర్వహిస్తున్నారు. మౌలిక వసతులు లేక ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసరాలకు విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు పడరానిపాట్లు పడుతున్నారు. వసతులు ఇలా ఉంటే చదువులు సాగేదెలా అంటూ ఆయా గ్రామాల ప్రజలు టీడీపీ కూటమి సర్కార్ తీరును తప్పుపడుతున్నారు. పాలకులు స్పందించి ఇప్పటికైనా స్కూళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థుల ఇబ్బందులు చూడలేకపోతున్నాం



పాఠశాల భవన నిర్మాణాలు నిలిచిపోడంతో విద్యార్థుల చదువుల ఇబ్బందులు చూడలేకపోతున్నాం. ఫర్నీచర్, టాయిలెట్‌ల సామగ్రి, బోర్డులు, కూర్చునే బల్లలు మధ్య చిన్నారులు విద్యనభ్యశించాల్సిన దుస్థితి నెలకొంది. మౌలిక వసతులు పూర్తిగా కరువయ్యాయి. తాగునీటికి సైతం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి తీసుకెళ్లిన నీరు అయిపోతే మళ్లీ వస్తున్నారు. దీంతో తరగతులకు సక్రమంగా హాజరు కావడం లేదు. వంటశాల లేనందున మధ్యాహ్న భోజనం ఆరుబయటే చేస్తున్నారు. అపరిశుభ్రత మధ్య వంటలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గాలివీస్తే దుమ్ము, ధూళి పడిన భోజనం భుజించాల్సిన దుస్థితి ఏర్పడింది.

– పాల బాషా, పి.రుద్రవరం గ్రామం

చాలా ఇబ్బందిగా ఉంది



షెడ్డులో విద్యనభ్యశించేందుకు మా గ్రామం విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. మండల పరిషత్ పాఠశాల భవన నిర్మాణాలకు గ్రామస్తుడు 6సెంట్లను గతేడాది ఉచితంగా ఇచ్చాడు. ఆస్థలంలో నాడు–నేడు పనులు మొదలు పెట్టారు. రెండు భవన నిర్మాణలు లెంటల్ వెవల్ జరుగుతుండగానే ప్రభుత్వం మారింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం పశుసంవర్ధక శాక భవనం గది, గ్రామస్తుల సహకరంతో నిర్మించిన షెడ్డులో పిల్లలు చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చలికి పిల్లల ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నాడు–నేడు పనులు ప్రరంభించేలా చర్యలు తీసుకోవాలి.

–షేక్.జలాల్ భాషా, పి.రుద్రవరం గ్రామం.

అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలి



నాడు–నేడు పథకం క్రింద స్కూల్ నిర్మాణం జరిగి ఉంటే విద్యార్థులు ఇబ్బందులు ఉండేవికావు. అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షెడ్డులో తరగతుల నిర్వహించడం వలన బోధన కుంటుపడుతుంది. విద్యార్థులు సైతం సక్రమంగా స్కూళ్లకు రాలేకపోతున్నారు. వర్షం వచ్చినప్పుడు, చలి గాలులు విచినప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు. 112 మంది విద్యార్థుల విద్యాభ్యాసం కుంటుపడింది. అత్యవసరాలకు ఉపాధ్యాల ఇబ్బందులు వర్ణనాతీతం. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి అభివృద్ధి పనులు పూర్తయ్యేల చర్యలు తీసుకోవాలి.

– రెపల్లె బడెసాబ్, ఆర్. కోంతలపాడు గ్రామం



రుద్దవరంలో నిలిచిపోయిని స్కూల్ అభివృద్ధి పనులు



పి.రుద్రవరం: పశుసంవర్ధక శాఖ భవనంలో విద్యనభ్యశిస్తున్న విద్యార్థులు



రుద్రవరం: చెట్టు కింద వంట చేస్తున్న దృశ్యం



ఆర్. కొంతలపాడులో జిల్లా పరిషత్ హై స్కూల్ దుస్థితి

పురాతన కోనేటిలో కంప చెట్లు తొలగింపు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామ సమీపంలోని పురాతన కోనేటిలో కంప చెట్లు తొలగింపునకు చర్యలు చేపట్టారు. కాల్వ గ్రామ శివారులో వున్న 15వ శతాబ్దపు నాటి అతిపెద్ద కోనేరును యూట్యూబర్ క్రియేటర్ యుగంధర్ నేతృత్వంలో ఆదివారం దాదాపు 80 మంది సేవాకర్తలతో ముళ్ల పొదలు, కంపచెట్లు తొలగించి శుభ్రం చేశారు. కోనేటికి ఎదురుగా వున్న 14 అడుగుల ఎత్తుగల కోనేటి ఆంజనేయస్వామి విగ్రహానికి సింధూర సేవాసమితి ఆధ్వర్యంలో సింధూర పూజ నిర్వహించారు. భవిష్యత్‌లో కోనేటిని పునఃరుద్ధరించి భక్తులకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని దేవస్థాన కమిటీ సభ్యులు ఆరవేటి రమేష్, సన్నిధి కొండయ్య తెలియజేశారు. కార్యక్రమంలో కర్నూలుకు చెందిన నాగేశ్వరరావు, ఆంజనేయులుగౌడు, శివరాంగౌడు, లక్ష్మినారాయణ, వేణుగోపాల్, ప్రసాద్, మేడం విజయ్‌కుమార్, కల్కి మురళి, విశ్రాంత డీఎస్పీ వెంకన్న చౌదరి, మహబలేశ్వర్, నాగోజిరావు, డా.మోక్షేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.



కోనేటిలో కంప చెట్లను తొలగిస్తున్న సేవాకర్తలు

నిరుద్యోగులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం



జిల్లా మహాసభల కర్రపత్రాలను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కోడుమూరు రూరల్: నోటిఫికేషన్ల పేరుతో కాలయాపన చేస్తూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి విమర్శించారు. ఆదివారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కారుమంచి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఉన్న పరిశ్రమలను కూడా ప్రైవేట్ రంగానికి కట్టబెడుతుండడంతో నిరుద్యోగులకు ఉపాధి దొరకని పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వ పాలన 6నెలలు గడిచినా డీఎస్సీపై పూర్తిగా నిర్ణయం తీసుకోకుండా నిరుద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తోందన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి గ్రూప్–1,2, పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలులో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ర్యాలీ, సభలో యువత భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కారుమంచి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్, నాయకులు సిద్ధు, శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, వీరాంజనేయులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ శతాబ్ది వేడుకలు

కల్లూరు: సీపీఐ శతాబ్ది వేడుకలు ఆదివారం శ్రీరామచంద్ర నగర్‌లో కల్లూరు అర్బన్ వార్డుల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా సీపీఐ వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన కూటమి సర్కార్ రూ.15వేల కోట్లు ప్రజలపై భారం వేసిందన్నారు. పేదలకు ఇంటి స్థలం మంజూరు చేయడంతో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, గిడ్డయ్య ఆచారి, రామాంజనేయులు, రబియా, నూర్జహాన్, మరియమ్మ, రాముడు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగరవేస్తున్న సీపీఐ నాయకులు

'అపూర్వ' కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ప్రభుత్వ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థుల (1988–89 బ్యాచ్) సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. అదే పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని ఉల్లాసంగా గడిపారు. పాతజ్ఞాపకాలు గుర్తు చేసుకుని మురిసిపోయారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

31లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, నన్నూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఖాతాదారులు ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని ఆయా సంఘాల సీఈఓలు మద్దిలేటి, మాలిక్‌బాషా, సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ పథకాలు వర్తిస్తాయని చెప్పారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సూచించారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలన్నారు.

అంగన్‌వాడి కేంద్రాలను విస్తరించండి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామాలలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడి కేంద్రాలను విస్తరించాలని గ్రామ నాయకులు విజయుడు, విశ్వేశ్వరరెడ్డి, ఖాజామియా ఆదివారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ఏళ్ల తరబడి జనాభా పెరుగుతున్న ఇప్పటి వరకు ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రమే ఉన్నాయన్నారు. పదేళ్లగా నన్నూరు శివారు ప్రాంతాలలో రాగమయూరి కాలనీలో సుమారు 600 నివాసాలు ఉండగా 2,500 మంది జనాభా ఉందన్నారు. ఈ కాలనీ వాసులు అంగన్‌వాడీ సేవలకు దూరమవుతున్నారని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాలకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు వెళ్లాల్సివస్తుందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాగమయూరిలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

బెస్తలు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు(అర్బన్): విద్య, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి తదితర అన్ని రంగాల్లో సంప్రదాయ మత్స్యకారులైన బెస్తలు రాణించాలని జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉల్లిందకొండ శ్రీనివాసులు అన్నారు. స్థానిక బీసీ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా నగరానికి చెందిన బెస్త గ్యాస్ శ్రీనివాసులను ఎంపిక చేసి నియామకపత్రాన్ని అందించారు. ఉల్లిందకొండ శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచిపోయినా..బెస్తలకు రాజకీయ వాటాలను కల్పించడం లేదన్నారు. జిల్లా నూతన అధ్యక్షుడు గ్యాస్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలోని బెస్తలను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. రాయలసీమ ఇన్‌చార్జ్ మిడుతూరు శ్రీనివాసులు, నాయకులు బెస్త శేషన్న, వెంకటేష్, రాధాకృష్ణ, పరమేష్, సత్యనారాయణ, నాగరాజు, నందకిషోర్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు పెద్దపీట



వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపల్‌రెడ్డిని కలిసిన రాఘవేంద్ర నాయుడు, నాయకులు

- నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాఘవేంద్ర నాయుడు ఆదివారం కల్లూరులోని కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహంలో పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులను కలిశారు. మర్యాద పూర్వకంగా శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లాల అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాఘవేంద్ర నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆశీస్సులతో పార్టీ బీసీ విభాగాన్ని బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు శివారెడ్డి, నాయకులు షరీఫ్, శీను, అంజి, లాజర్, నరసింహారెడ్డి, రంగన్న, భాస్కర్, మున్నీర్, జగదీష‌రెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు



కోడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్నసీపీఐ నాయకులు, కళాకారులు

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ పోరాటాలు సాగిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రయ్య తెలిపారు. సీపీఐ శత ఆవిర్భావ ఉత్సవాలు ఆదివారం నాయకులు కోడుమూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక హైస్కూల్ నుంచి పాతబస్టాండ్‌లోని సంతమార్కెట్ వరకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎర్రచీరెలు ధరించిన మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి రామచంద్రయ్య ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్యం కోసం, కార్మిక, కర్షక, ప్రజల హక్కుల కోసం సీపీఐ పార్టీ ఎనలేని పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, మండల కార్యదర్శి రాజు, నాయకులు చిన్నరాముడు, శేషఫణి, మునిస్వామి, మధు, మహిళా సంఘం నాయకురాళ్లు విజయభారతి, రాజేశ్వరి, సులోచనమ్మ, లక్ష్మిదేవి, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్‌కు తాళం

కోడుమూరు రూరల్ : స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌కు ఆదివారం ఉదయం సిబ్బంది తాళం వేశారు. ఉదయం 11గంటల ప్రాంతంలో ఎక్సైజ్ స్టేషన్‌కు ఏకంగా తాళం వేసుకుని సిబ్బంది అంతా బయటకు వెళ్లిపోయారు. సీఐ మంజుల, ముగ్గురు కానిస్టేబుళ్లతో కలిసి వెల్దుర్తిలో తనిఖీల నిమిత్తం వెళ్లారు. ఈ సమయంలో ఎస్ఐతో పాటు, మరో కానిస్టేబుల్ డ్యూటీలో ఉన్నారు. అయితే వీరు సైతం ఏదో పనిపై వెళ్లాల్సి రావడంతో ఏకంగా స్టేషన్‌కు తాళంవేసినట్లు సమాచారం. సుమారు 30నిమిషాల పాటు స్టేషన్‌కు తాళం వేసివుండటాన్ని గమనించి ఎక్సైజ్ సీఐ మంజులు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. సిబ్బంది తనిఖీల నిమిత్తం వెళ్లారని, కాసేపట్లో వస్తారన్నారు.



ఎక్సైజ్ స్టేషన్‌కు తాళం వేసిన ఉన్న దృశ్యం